క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): కలెక్టర్ హరినారాయణ న్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఎమ్మెల్యేయ వెంట వీరి చలపతి, నిరంజన్‌బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ముత్తుకూరు: మండలంలోని నారికేళపల్లిలో ఆదాని, అపోలో ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు గాయత్రి, సుహర్షన్ సుమారు 60 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కృష్ణవేణి, ఫౌండేషన్ ప్రతినిధులు రవీంద్ర అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమావేశం రేపు



నెల్లూరు (పొగతోట): ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్‌ల సదస్సును నగరంలోని మినర్వా గ్రాండ్‌లో బుధవారం నిర్వహించనున్నామని సర్పంచ్‌ల సంఘ కన్వీనర్ శివకుమార్, కార్యనిర్వాహకుడు నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. సర్పంచ్‌ల సమస్యలపై చర్చించనున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

రామానుజాచార్యులకు పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల అవతార మహోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామివారికి పలు పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఎదుట ఆందోళన

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట ఆందోళనను బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడారు. కళాశాల యాజమాన్య నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. విద్యార్థి మృతికి కారకుడైన డ్రైవర్‌పై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం

నెల్లూరు (పొగతోట): వేదాయపాళెంలోని స్వర్ణదీపం దివ్యాంగుల ఆశ్రమం, జీజీహెచ్‌లో అన్నదాన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. దేవినేని నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని రాజేష్ యువసేన ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి



నెల్లూరు(బృందావనం): మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయప్ప ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఎంఈఓ తిరుపాల్, రమేష్, రమణయ్య, సుబ్బారావు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముద్దుమూడి, చెరుకుమూడి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రి కాకాణి పర్యటించారు. తొలుత సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను ప్రారంభించారు. అనంతరం ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌రెడ్డిని అభినందించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించామన్నారు. గ్రామాల్లో మట్టి రోడ్డు లేకుండా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని వివరించారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ రమణయ్య, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రవికుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి నగదు విరాళం



ఏఎంసీ చైర్మన్, వైస్‌ఎంపీపీను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోవూరు: స్థానిక గాంధీబొమ్మ సమీపంలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయానికి రంగులు వేసేందుకు మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి రూ.50 వేలు విరాళాన్ని ప్రకటించారు. సోమవారం ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదును అందజేశారు. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ శివుని నరసింహులురెడ్డిని ట్రస్టు బోర్డు సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ చైర్మన్ బండ్ల సురేష్, ఆలయ ప్రధానార్చకులు సుబ్బరామయ్యశర్మ, ట్రస్టు బోర్డు సభ్యులు పాటూరు మోహన్, బండ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం



కల్లుగీత కార్మికుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభాకర్

కొడవలూరు: మిక్కిలింపేటకు చెందిన గీత కార్మికుడు ఉప్పాల వెంకటేశ్వర్లుకు జిల్లా గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు తోట ప్రభాకర్ సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. వెంకటేశ్వర్లు చెట్టుపై నుంచి జారిపడి గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా తోట ప్రభాకర్ మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోనూరు గోవిందయ్య ఎంతో మంది గీత కార్మికులను ఆదుకున్నారని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కోవూరు రాజశేఖర్ గౌడ్, కార్యదర్శి దాసరి వెంకటేశ్వర్లు, కోశాధికారి కోనూరు గోవింద్, సంఘ కార్యదర్శి అల్లూరు ప్రశాంత్, సభ్యులు వాకా బ్రహ్మనాయుడు, మడపర్తి మల్లికార్జున, తిరకాల రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులకు అభినందన



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ వేమారెడ్డి

ముత్తుకూరు: సింహపురి కరాటే అకాడమీలో శిక్షణ పొందిన ముత్తుకూరు కరాటే విద్యార్థులు యూనివర్సల్ అచీవర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. చెన్నైలో విరామం లేకుండా గంట పాటు జరిగిన కర్ర సాము ప్రదర్శనలో జ్యోతి, స్నేహలత, లహరి, మౌనిక, వీరేంద్ర, గృష్లేష్, సుప్రియ, తదితరులు పాల్గొని రికార్డు సాధించారు. ఒంగోలులో జరిగిన కరాటే స్కూల్ గేమ్స్‌లో సుప్రియ, జ్యోతిశ్వర్ సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరాటే క్రీడాకారులను కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డి సోమవారం అభినందించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



పొదలకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అగ్నికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఓ వరకుమార్ పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది డెమో ద్వారా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అగ్నిమాపక ఉద్యోగులు పాల్గొన్నారు.

1.13 కోట్ల పని దినాలే లక్ష్యం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకట్రావ్

మనుబోలు: 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1.13 కోట్ల పని దినాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని డ్వామా పీడీ వెంకట్రావ్ తెలిపారు. మండలంలోని పిడూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నిత్యం జిల్లాలో 1.20 కోట్లు, మండలంలో 2,600 పని దినాలను లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. వేసవిలో కూలీలకు సరాసరి రూ.272 కూలి అందేలా చూడాలన్నారు. కూలీలకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఉపాధి ఏపీఓ రాజమ్మ, టీఏ సుప్రజ, సిబ్బంది ఉన్నారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): జాబ్‌మేళాను బుధవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ సోమవారం తెలిపారు. బాలాజీ ఏజెన్సీస్, అశోక్ లేలాండ్ వెహికల్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా (ఎలక్ట్రీషియన్స్, మోటార్.. డీజిల్ మెకానికల్) చదివిన 21 నుండి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. అకౌంటెంట్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ మేనేజర్, ఫ్లోర్ క్వాలిటీ కంట్రోలర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, హెల్పర్, తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నారని వివరించారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తులకు 24 తుది గడువు



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): ఏపీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని గండిపాళెం గురుకుల విద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఆసక్తి గల వారు aprs.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంఘ సభ్యులు కిషన్‌కుమార్, కిరణ్‌కుమార్, రమేష్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోవూరు: కోవూరు పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సోమవారం తెలిపారు. రామనాథపురం, విఘ్నేశ్వరపురం, చుండుగుంట, తూర్పు అరుంధతీయవాడ, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: సర్వేపల్లి వద్ద కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై సోమవారం మోటారు బైక్ అదుపు తప్పడంతో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. వివరాలు..గూడూరుకు చెందిన కృష్ణకిషోర్ పని నిమిత్తం మోటారు బైక్‌పై ముత్తుకూరుకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ప్రమాదవశాత్తు మోటారు బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయిని మృతికి సంతాపం



స్వాతి(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ వడ్డిపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న సీహెచ్ స్వాతి (40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె స్వగ్రామైన రేబాలలోని నివాసంలో తుది శ్వాస విడిచారు. ఉపాధ్యాయిని మృతికి ఎంఈఓ దిలీప్, సహచర ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

దళితులపై దాడి హేయం



బుచ్చిరెడ్డిపాళెం: చిత్తూరు జిల్లా పుంగనూరులో దళితులపై పోలీసులు దాడికి పాల్పడడం హేయమైన చర్యని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గంటా నరసింహులు ఖండించారు. స్థానిక జొన్నవాడ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పుంగనూరులో అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగింపు వివాదం నేపథ్యంలో పోలీసులు దళితులపై దాడికి పాల్పడడం దారుణమన్నారు. బాధ్యులైన పోలీసు అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, అంకయ్య, మహేంద్ర, అబ్దుల్, పీ శ్రీనివాసులు, పుల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

వేసవి తాపంతో నిర్మానుష్యంగా రోడ్లు



పొదలకూరు : ఎండలు నిప్పుల కొలిమిలా మారాయి. పొదలకూరు వెలుగొండలకు దగ్గరగా ఉండడంతో 1 నుంచి 2 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఉదయం 11 గంటలు దాటితే ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అత్యవసర పనులు ఉన్న వారు తప్ప మిగిలిన వారు రోడ్లపైకి రావడం లేదు. దీంతో మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

హెచ్‌ఎంకు అభినందనలు



చెంచురామయ్య

ముత్తుకూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యేటూరు చెంచురామయ్య ఏపీజేఏసీ అమరావతి జిల్లా కోచైర్మన్‌గా నియమితులయ్యారు. ఏపీజేఏసీలో కొంతకాలంగా చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయన్ని నెల్లూరులోని పురమందిరంలో సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కోచైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంకు పలువురు అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



మహిళా సంఘాలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కొడవలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 64,450 గృహాలను సందర్శించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు గడప గడపకు చేరడంతో ప్రతి ఇంటా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఒక్క బటన్‌తో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తుండడంతో ఏ ఇంటికి వెళ్లినా బిడ్డగా, అన్నగా, మనుమడిగా ఆదుకుంటున్నారని సంతోషంగా చెబుతున్నారన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నా ప్రతిపక్షాలు వక్రభాష్యం పాడుతుండడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఎన్ని ఎత్తులు వేసినా జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలుస్తారని స్పష్టం చేశారు. గడిచిన నాలుగేళ్లలో కొడవలూరులో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.9.32 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. అనంతరం కొడవలూరు గిరిజన బాలుర గురుకులంలో నాడు-నేడు కింద రూ.24 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

రూ.52.80 కోట్ల పొదుపు రుణాలు

కొడవలూరు మండలంలోని 676 పొదుపు సంఘాలకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.52.80 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును పొదుపు సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కొడవలూరు మండలంలో వైఎస్సార్ ఆసరా కింద మూడు విడతల్లో రూ.21 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జీ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీటీసీ ప్రతాప్, సర్పంచ్ కామాక్షి, నాయకులు సునీతమ్మ, ఎస్ తిరుపతమ్మ, పీ రవి, నబీబుల్లా, కే నాగేశ్వరరావు, ఎస్ నాగేశ్వరరావు, పంచాయతి కార్యదర్శి జీ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి సన్మానం



మనుబోలు: నెల్లూరులోని నివాసంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జట్లకొండూరు గ్రామ దళితులు సోమవారం కలిశారు. పాకాల చెరువు కట్టను అభివృద్ధి చేయించడంపై గజమాలతో సన్మానించారు. పాకాల చెరువు కట్ట ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ట్రాక్టర్ల ద్వారా ఎరువులు, పంట ఉత్పత్తులు తరలించేందుకు అవస్థ పడుతున్నారు. ఈ సమస్యను మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి చెరువు కట్టను అభివృద్ధి చేయించడంతో దళితులు సంతోషం వ్యక్తం చేశారు. కాకాణిని గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

చెడుగుడు పోటీల విజేత కోవూరు



నగదు బహుమతి అందుకుంటున్న విజేత జట్టు

కోవూరు: స్థానిక దళితవాడలో రెండ్రోజులుగా జరుగుతున్న తువ్వర పుల్లయ్య మెమోరియల్ జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో కోవూరు జట్టు విజేతగా నిలవగా, సోమరాజుపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. ముదివర్తి తృతీయ, యల్లాయపాళెం నాల్గోవ, కోవూరుకు చెందిన మన్నెం సునీల్ జట్టు ఐదోస్థానంలో రాణించాయి. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పీ లవ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, సువర్ణమ్మ, జయప్రకాశ్, ఫిజియోథెరపిస్ట్ తువ్వర రవితేజ, రాజ్‌కుమార్, జాన్సన్, అమర్, జ్యోతి, విజయ్‌కుమార్, సింహాద్రి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందూ ధర్మ ప్రచారం



నెల్లూరు(బృందావనం): మూలాపేట, నీలగిరి సంఘం, తదితర ప్రాంతాల్లో ఇందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి మాట్లాడారు. ఆచార్య ప్రబోధానందయోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. రత్నం, సుధాకర్ ఆచారి, నరసింహప్రసాద్, సునీల్, నరసారెడ్డి, పద్మజ, మనోజ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వైద్య శిబిరం



నెల్లూరు(అర్బన్): కలెక్టరేట్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించే తిక్కన భవన్ వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రత నేపథ్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ఉద్యోగులతో పాటు ప్రజలకు బీపీ, తదితర పరీక్షలు చేశారు. వడదెబ్బ తగలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురికి మందులను అందజేశారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.